సాక్షి పల్నాడు

గురువారం । 1 । మే । 2025



ఆంజనేయుడికి మల్లెపూల అర్చన

సత్తెనపల్లి: నాగన్నకుంటలోని శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామిని మల్లెపూలతో అలంకరించి అర్చన జరిపారు.



ముగిసిన బాలయేసు చర్చి తిరునాళ్ల

నాదెండ్ల: కనపర్రు బావివద్ద కొలువైయున్న బాలయేసు పుణ్యక్షేత్ర తిరునాళ్ల బుధవారంతో ముగిసింది. విచారణ గురువు జోజయ్య ప్రత్యేక ప్రార్థనలు, దివ్యపూజాబలి నిర్వహించారు.



చందన అలంకారంలో నారసింహుడు

తెనాలి: అక్షయ తృతీయ సందర్భంగా నాజరుపేటలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బుధవారం వేడుకలు జరిగాయి. చందన అలంకారంతో స్వామి దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

మహాత్మ బసవేశ్వరకు ఘననివాళి



నరసరావుపేట: సమాజంలోని కుల వ్యవస్థ, వర్ణ భేదాలు, లింగ వివక్షతను వ్యతిరేకించిన అభ్యుదయవాది మహాత్మ బసవేశ్వర అని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు కొనియాడారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో బసవేశ్వర జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్‌ఓ ఏకా మురళి, అధికారులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బిల్లుకు వ్యతిరేకంగా వినూత్న నిరసన

లైట్లు ఆఫ్ చేసిన ముస్లిం వీధి వాసులు



నకరికల్లు: వక్ఫ్ సవరణ చ నిరసనగా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు ముస్లింలు బుధవారం రాత్రి నిరసన తెలిపారు. ఇళ్లు, దుకాణాల్లోని లైట్లు ఆఫ్ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మత పెద్దలు మాట్లాడుతూ భారత రాజ్యాంగ పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ, ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు స్వచ్ఛందంగా నిరసన తెలిపామన్నారు. ఇషా నమాజు ప్రార్థనలు ముగించుకొని రాత్రి 9గంటల నుంచి 9:15 వరకు లైట్లు ఆపి నిరసన ప్రకటించామన్నారు. ముస్లింల అభివృద్ధికి ఆటంకంగా మారడంతో పాటు ముస్లింల భవితవ్యం అంధకారంలోకి నెట్టే వక్ఫ్ సవరణ బిల్లును కేంద్రప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు నిరసనలు తెలుపుతామన్నారు.

విజయకీలాద్రిపై తిరునక్షత్ర మహోత్సవం



తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి సీతానగరం విజయకీలాద్రిపై గల స్వామికి బుధవారం తిరునక్షత్ర మహోత్సవం వైభవంగా నిర్వహించారు. 1008వ భగవద్రామానుజాచార్యస్వామి తిరునక్షత్ర మహోత్సవాల్లో భాగంగా ఉదయం అభిషేకం, సేవా కాలం, అర్చన, తీర్థప్రసాద గోష్టితో కార్యక్రమం సుసంపన్నమైంది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి అనుగ్రహాన్ని పొందారు.

సజావుగా పాలిసెట్

84 శాతం మంది హాజరు



గుంటూరు ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష బుధవారం సజావుగా జరిగింది. గుంటూరు నగరంలో 11 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 4,055 మంది విద్యార్థులకు గానూ 3,408 మంది హాజరయ్యారు. 84 శాతం హాజరు నమోదైనట్లు పాలిసెట్–25 సమన్వయకర్త తాళ్లూరి శేఖర్ తెలిపారు

బగళాముఖి అమ్మవారి తిరునాళ్ల ప్రారంభం



చందోలు(కర్లపాలెం): బగళాముఖి అమ్మవారి వార్షిక తిరునాళ్ల మహోత్సవాలలో భాగంగా బుధవారం వైభవంగా కొలుపులు ప్రారంభమయ్యాయి. బాపట్ల జిల్లా పిట్లలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు ఈ నెల 5వ తేదీ వరకు జరుగనున్నాయి. తొలిరోజు అఖండ జ్యోతి దీపారాధనతో వేద మంత్రాలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. శ్రీ ఉమాసుందరి మహాదేవి విశేష అలంకరణ చేశారు. వీరాచార ఆచారవంతుల సంప్రదాయం ప్రకారం అమ్మ వారికి వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ప్రతిరూపాలైన పావనము, ఘటము, చందోలు కొత్తరెడ్డిపాలెం, సంగుపాలెం గ్రామాలలో ఊరేగించారు.

బిల్లుల్ని పేల్చేస్తున్న తమ్ముళ్లు!

- యథేచ్ఛగా ఎక్స్‌ప్లోజర్స్ విక్రయం
- 80 శాతం వరకు బిల్లుల్లేని అమ్మకాలే
- లైసెన్స్ హోల్డర్ల అక్రమ వ్యాపారాలు
- చీమకుర్తి ప్రాంతంలో పచ్చ నేత దందా
- కూటమి పాలన వచ్చాక తనిఖీలు శూన్యం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: చీమకుర్తి, బల్లికురవ ప్రాంతాలకు చెందిన కొందరు లైసెన్స్ హోల్డర్లు అక్రమంగా దిగుమతి చేసుకొని క్వారీల యజమానులకు విక్రయిస్తున్నారు. బిల్లులు లేకుండా దొరుకుతుండడంతో క్వారీ యజమానులు వీలయినంత ఎక్కువగా పేలుడు పదార్థాల కొనుగోలుకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

అడ్డగోలుగా వ్యాపారం

- చీమకుర్తి కేంద్రంగా పేలుడు పదార్థాల వ్యాపారం నడిపిస్తున్న త్రినాథరావు అనే వ్యక్తికి 21 లైసెన్సులతోపాటు మరొకటి లీజుకు తీసుకున్న లైసెన్స్ ఉంది. ఆయన మూడు జిల్లాల్లో వ్యాపారానికి కింగ్ పిన్‌గా ఉన్నారు. చీమకుర్తి ప్రాంతంలో గోదాములు ఏర్పాటు చేసుకొని బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు సైతం బిల్లులు లేకుండానే పేలుడు పదార్థాలు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. కొందరు లైసెన్స్‌దారులు ఇతని పేరు మీదే ఇండెంట్ పెట్టుకుని పేలుడు పదార్థాలు తెప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎక్స్‌ప్లోజర్స్‌లో కేవలం 20 శాతానికి మాత్రమే బిల్లులు ఇస్తున్నారని సమాచారం.
- బల్లికురవ ప్రాంతం నాగరాజు పల్లెకు చెందిన హరిప్రసాద్‌బాబు సైతం గంగపాలెం ప్రాంతంలో గోదాము ఏర్పాటు చేసి అక్రమంగా ఎక్స్‌ప్లోజర్స్ వ్యాపారం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. సదరు వ్యాపారికి చీమకుర్తి, బల్లికురవ ప్రాంతాల్లో గోదాములు ఉన్నాయి. నెల్లూరు కేంద్రంగా కూడా వ్యాపారం సాగిస్తున్నట్లు సమాచారం.
- ఇదే గ్రామానికి చెందిన రాజేష్‌కుమార్ కూడా 20 వరకు క్వారీలకు 18 టన్నుల గోదాములు ఏర్పాటు చేసి ఎక్స్‌ప్లోజర్స్‌ను పెద్ద ఎత్తున విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.
- మార్టూరుకు చెందిన మల్లి వలపర్ల ప్రాంతంలో గోదాము ఏర్పాటు చేసుకొని అక్రమ పేలుడు పదార్థాలను విక్రయిస్తున్నట్లు సమాచారం.
- రామాంజిపురానికి చెందిన హనుమంతు అనే వ్యక్తి రామాంజిపురం ప్రాంతంలో 4 టన్నుల గోదాము నిర్మించుకొని పేలుడు పదార్థాల వ్యాపారం సాగిస్తున్నారు.
- ఇదే వ్యక్తి నాగరాజుపల్లి ప్రాంతంలో 3 టన్నుల గోదాము ఏర్పాటు చేసి పేలుడు పదార్థాల వ్యాపారం సాగిస్తున్నట్లు సమాచారం.



బల్లికురవ ప్రాంతంలో గ్రానైట్ క్వారీ

పచ్చ పార్టీ అండతోనే....

పేలుడు పదార్థాల లైసెన్స్‌దారులు చాలామంది పచ్చ పార్టీ అండతో అక్రమంగానే విక్రయాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. వీరంతా దాదాపు డీగార్డ్, దిఎఫ్, కేబుల్, వయరులో పాడి, తూటా (జెల్‌బాక్స్) 180, 200 మాటర్లు, బూస్టర్లు, ఈడీ (గిలిటెన్ స్టిక్స్), ఓడీ తదితర పేలుడు పదార్థాలను క్వారీలలో పేలుళ్ల కోసం విక్రయిస్తున్నారు. హైదరాబాద్, నాగపూర్, చెన్నై ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. కొందరు వ్యాపారులు నిషేధిత పేలుడు పదార్థాలను సైతం తెచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం.

పొంచి ఉన్న పెను ప్రమాదం

హైదరాబాద్, నాగపూర్, చెన్నై ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్న పేలుడు పదార్థాలను అనధికారికంగా గ్రానైట్ క్వారీల్లో పేలుళ్ల కోసం విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇది ప్రమాదమని తెలిసినా వ్యాపారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. లెక్కా పత్రం లేకుండా పేలుడు పదార్థాల విక్రయాల వల్ల పెను ప్రమాదాలకు ఆస్కారముంది. ఎక్స్‌ప్లోజర్స్ అసాంఘిక శక్తులకు చేరే ప్రమాదమూ ఉంటుంది. ఇదే జరిగితే ఊహించని నష్టం వాటిల్లవచ్చు. ఏ చిన్న అవకాశం దొరికినా అశాంతి సృష్టించేందుకు ఉగ్రమూకలు పొంచి ఉంటాయి. ఇలాంటి పరిస్థితిలో పేలుడు పదార్థాల విక్రయాలకు నియంత్రణ అవసరం. బిల్లులతో విక్రయాలు జరిగేలా చూడాలి. అధికారుల నిఘా మధ్య వాటిని వినియోగం ఉండేలా చర్యలు చేపట్టాలి. ఇప్పటికైనా మైనింగ్‌తో పాటు జిల్లా ఉన్నతాధికారులు పేలుడు పదార్థాల వినియోగంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్వారీల్లోని పేలుళ్లు, పేలుడు పదార్థాల విక్రయాలు, వినియోగాన్ని అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

అండగా అధికార యంత్రాంగం

క్వారీ యజమానులతోపాటు పేలుడు పదార్థాల విక్రయదారులు దాదాపుగా పచ్చపార్టీ నేతలు, మద్దతుదారులు కావడంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. పైగా వ్యాపారులు దాదాపుగా చంద్రబాబు సామాజికవర్గం వారే కావడంతో అటువైపు తొంగిచూసేందుకు కూడా అధికారులకు ధైర్యం చాలడం లేదని తెలుస్తోంది. ఇటీవల మార్టూరులో ఇతర సామాజికవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతకు చెందిన ఎక్స్‌ప్లోజర్స్ గోదామును తనిఖీ చేసి నానా హంగామా చేసిన అధికారులు... చీమకుర్తి, బల్లికురవ, సంతమాగులూరు ప్రాంతాల్లో విక్రయాల జోలికి వెళ్లకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

బాబును 420 అన్నందుకే కేసు

- వైఎస్ జగన్ సీఎంగా ఉండగానే ఎన్నో మాటలు తూలనాడిన కూటమి నేతలపై ఎన్ని కేసులు పెట్టాలో..
- ప్రజలను మోసం చేసిన వారిని 420 అనే అంటారు
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని ముఖ్యమంత్రి చంద్రబాబును 420 అన్నందుకే తనపై కేసు పెడితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉండగా ఆయనను తూలనాడిన టీడీపీ, ఇతర పార్టీల నాయకులపై ఎన్నికేసులు పెట్టాలని నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. తనపై ఎన్ని కేసులు పెట్టుకున్నా భయపడేది లేదన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే అరవిందబాబు తన గురించి నీ నోరు కత్తిరిస్తా.. నాలుక తొలగిస్తా..రోడ్డుపై తిరగనీయం లాంటి అప్రజాస్వామిక మాటలు, వ్యక్తిగత విమర్శలు చేయడం సరైంది కాదన్నారు. చంద్రబాబును తాను 420 అన్నమాట నిజమేనని, రాష్ట్రంలోని కోట్ల మంది ప్రజలను మోసం చేసిన మాట నిజం కాదా అని అన్నారు. మోసం చేసిన వ్యక్తిని 420 అనకుండా ఏమంటారని ప్రశ్నించారు. జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా ఉండగా సైకో అంటూ అనేక మంది ప్రజాప్రతినిధులు వేదికలెక్కి అన్నారన్నారు. వీరిపై ఎన్నికేసులు, చర్యలు తీసుకోవాలనే దానిపై జవాబులేదన్నారు.

విబేధాల సృష్టికి కుట్ర

స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును తాను అరబంద్రపు బాబు అన్నది నిజమేనని అన్నారు. ఆయన చేసే పనులు, కార్యక్రమాలు అదేవిధంగా ఉన్నాయన్నారు. కాసు సెంట్రల్‌మాల్ ప్రారంభోత్సవానికి తాను వెళ్లొద్దని అతనికి సమాచారం ఇచ్చానని మంగళవారం ఒక వేదికపై నుంచి చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. తాను సమాచారం ఏవిధంగా ఇచ్చాననేది చెప్పలేదని, పదేళ్ల క్రితం తాను ఫోన్‌లో అరవిందబాబుతో హాస్పిటల్ విషయంపై మాట్లాడానన్నారు. ఇప్పుడు ఆయన నంబర్‌కూడా తనకు తెలియదన్నారు. నేను మెసేజ్ పెట్టి ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. కాసు కుటుంబం, తనకు మధ్య విబేధాలు సృష్టించాలని ఎమ్మెల్యే కుట్ర చేస్తున్నాడన్నారు.

ఇదిగో ఎమ్మెల్యే అవినీతి చిట్టా..

ఎమ్మెల్యే అరవిందబాబు అవినీతి ఏడాది కాలంలోనే కొండవీటి చాంతాడంత ఉందన్నారు. వైఎస్సార్ సీపీకి చెందిన ఆరుగురు బార్ యజమానుల వద్ద రెన్యువల్ కోసం ఒక్కొక్కరి నుంచి రూ.10లక్షలు చొప్పున రూ.60లక్షలు తీసుకున్నాడన్నారు. జ్యోతినికేతన్ దగ్గర రియల్ ఎస్టేట్ వెంచర్ వేసిన వ్యక్తుల దగ్గర నుంచి రూ.80లక్షలు తీసుకున్నాడని, గత ప్రభుత్వంలో మొదలు పెట్టిన భవన యజమానుల వద్ద నుంచి డబ్బులు వసూలుచేశాడని, గుంటూరు రోడ్డులో ఒక హాస్పిటల్ నిర్మాణం చేస్తుంటే రూ.40లక్షలు డిమాండ్ చేసి రూ.15లక్షలు తీసుకొన్నాడన్నారు. ప్రకాష్‌నగర్‌లో ఇళ్లు నిర్మించుకునేవారి దగ్గర డబ్బులు తీసుకున్నాడన్నారు. కోటప్పకొండ వద్ద దేవదాయ భూముల్లో మట్టి తవ్వింది ఎవరని ప్రశ్నించారు. సత్తెనపల్లిరోడ్డులో వైఎస్సార్ సీపీ వ్యక్తి వేసిన వెంచర్‌లో డబ్బులు ఇవ్వలేదని హద్దు రాళ్లు పీకించాడన్నారు. రేషన్ బియ్యం అక్రమ దందా చేపిస్తూ నెలకు రూ.26లక్షలు వసూలు చేస్తున్నాడన్నారు. కాంట్రాక్టు ఉద్యోగాలు ఇచ్చినందుకు ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షలు, పాత ఉద్యోగస్తుల్ని ఉంచడానికి ఒక రేటు కొత్తవారికి ఉద్యోగాలు ఇచ్చినందుకు ఇంకొక రేటు పెట్టి వసూలు చేస్తున్నాడన్నారు. గతంలో చేసిన పాత వర్కులకు కాంట్రాక్టర్ల వద్ద నుంచి పదిహేను శాతం కమీషన్ తీసుకున్నాడని చెప్పారు. ఇలా చెప్పుకొంటూ పోతే ఎమ్మెల్యే అరవిందబాబు అవినీతికి అంతేఉండదని పేర్కొన్నారు.

ప్రధాని సభకు భారీగా జనసమీకరణ

- అందుకు తగిన ఏర్పాట్లు చేయండి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్

నరసరావుపేట: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 2వ తేదీన అమరావతి రాజధాని పునర్నిర్మాణ కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో పల్నాడు జిల్లా నుంచి 800 బస్సుల్లో ప్రజలను చేరవేసే ప్రక్రియలో భాగంగా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. బుధవారం జిల్లా, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. ప్రతి బస్సులో మెడికల్ కిట్లతోపాటు ఒక ఆశా వర్కర్ ఉండాలన్నారు. బస్సుల్లో మంచినీటి వసతి, ఉదయాన్నే అల్పాహారం, భోజనం వసతులు ఏర్పాటు చేయాలన్నారు. మధ్యాహ్నం ఒంటిగంట కల్లా సభాస్థలికి చేరుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. సంబంధిత డీఎస్‌ఓ, మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రతి బస్సులోనూ ఇద్దరు ప్రభుత్వ సిబ్బందిని ఇన్‌చార్జిగా ఉంచాలన్నారు. వీటన్నిటికీ జేసీ సూరజ్ గనోరేను నోడల్ అధికారిగా నియమించామన్నారు. రూట్ మ్యాప్‌ను పంచాయతీరాజ్ శాఖ ఈఈ రాజా నాయక్ నిర్వహిస్తారన్నారు. ఎక్కువగా పెదకూరపాడు నియోజకవర్గ నుంచి ప్రజలను తరలించే విధంగా స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రధాని పర్యటనకు సంబంధించి జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా, క్షేత్రస్థాయిలోని అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్

పురాతన ఆలయం నేలమట్టం

- అచ్చంపేట మండలం అటవీ ప్రాంతంలో తుల్జా భవానీ మునీశ్వరస్వామి ఆలయం
- ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు



నేలమట్టమైన శివలింగ పాణివట్టం



అమ్మవారి స్వరూపం

అచ్చంపేట: మండలంలోని ఎంతో పురాతనమైన తుల్జా భవానీ మునీశ్వరస్వామి ఆలయాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. పల్నాడు జిల్లా అచ్చంపేట నుంచి మాదిపాడు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గంలో పుట్లగూడెం వద్ద బల్లకట్టు అడ్డ రోడ్డుకు ఎదురుగా అడవిలోకి మరో మార్గం వస్తుంది. ఆ మార్గం అడవిలో నుంచి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న బెల్లంకొండ మండలం వెంటాయపాలెం వరకు ఉంటుంది. ఆ మార్గం మధ్యలోనే తుల్జా భవానీ మునీశ్వరస్వామి ఆలయం ఉంటుంది. దేవాలయం అక్కడుందన్న విషయం చాలా మందికి తెలియదు. దానికి సంబంధించివారు ఎప్పుడో ఆరు నెలలకో, యేడాదికో వెళ్లి పూజలు నిర్వహిస్తుంటారని సమాచారం. అయితే ఆ దేవాలయాన్ని గుర్తు తెలియని దుండగులు నేలమట్టం చేశారన్న విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది.

వ్యక్తి ఫిర్యాదుతో వెలుగులోకి..

సాధారణంగా ఈ అటవీమార్గాన్ని ఎవరూ ఉపయోగించరు. తాము పూజించుకునే అమ్మవారి మండపాన్ని, శివలింగం పాణివట్టాన్ని, అమ్మవారి స్వరూపాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు బెల్లంకొండ తహసీల్దార్ కార్యాలయంలో ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దీంతో బెల్లంకొండ తహసీల్దార్ ఆదేశాల మేరకు వెంకటాయపాలెం వీఆర్‌ఓ మస్తాన్‌వలి అక్కడకు వెళ్లి చూడగా నేలమట్టమైన ఆలయ శిథిలాలు కనిపించాయి. రెండు, మూడు రోజులక్రితం దేవాలయాన్ని కూల్చి ఉండవచ్చని భావిస్తున్నారు. అటవీ సిబ్బంది తొలగించారనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి కుసుమ కుమారిని వివరణ కోరగా దేవాలయంపై తమకు ఎలాంటి సమాచారం లేదని, అసలు అక్కడ దేవాలయం ఉందన్న విషయం కూడా తెలియదన్నారు.

క్లుప్తంగా

బ్రాహ్మణ బాలురు దరఖాస్తు చేసుకోండి

అమరావతి: విజయవాడ పరిసర ప్రాంత కళాశాలల్లో ఇంటర్ నుంచి ఆ పై చదువులు చదువుతున్న విద్యార్థులు హాస్టల్‌లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తుమ్మలపల్లి అన్నపూర్ణమ్మ బ్రాహ్మణ బాలుర విద్యార్థి వసతి గృహం అధ్యక్షుడు జంధ్యాల శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ గవర్నరుపేట, పెద్దిబొట్లవారివీధి, ఏలూరురోడ్డులోని శ్రీమతి తుమ్మలపల్లి అన్నపూర్ణమ్మ బ్రాహ్మణ బాలుర విద్యార్థి వసతి గృహంలో విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. గుంటూరు, తెనాలి, గుడివాడ ప్రాంతాల పరిధిలోని కళాశాలల్లో చదువుచున్న విద్యార్థినులకు ఉపకార వేతనాలు ఇస్తామని తెలిపారు. స్కాలర్ షిప్‌నకు దరఖాస్తు చేసుకునే విద్యార్థినులు వసతి గృహ కార్యాలయంలో గానీ, 8309012282, 9848044152 నెంబర్లలో గానీ సంప్రదించాలని తెలిపారు.

మ్యూజియంలను అభివృద్ధి చేయాలి



విజయపురిసౌత్: ప్రపంచ పర్యాటక కేంద్రాలైన నాగార్జునకొండ, అమరావతి, చంద్రగిరిలలోని మ్యూజియంలను అభివృద్ధి చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు బుధవారం భారత ప్రభుత్వ కేంద్ర పురావస్తుశాఖ అదనపు డైరెక్టర్ జనరల్ ఆనంద్ మద్కర్‌ను ఢిల్లీలో కలిసి విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ పర్యాటకులు తరుచూ ఈ మ్యూజియంలను సందర్శిస్తున్నారని కానీ వారు ఇక్కడ గైడ్స్ సదుపాయం లేక ఈ ప్రాంతాల చరిత్రను తెలుసుకోలేకపోతున్నారన్నారు. ఈ మ్యూజియంలలో డిస్‌ప్లే బోర్డ్స్, లైటింగ్ గ్యాలరీలను అభివృద్ధి చేయాలని కోరారు. దీనికి స్పందించిన ఆనంద్ మద్కర్ మ్యూజియాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని త్వరలో తగు అభివృద్ధి చర్యలు చేపడతామని చెప్పినట్లు వీరాంజనేయులు తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 514.20 అడుగుల వద్ద ఉంది. ఇది 138.9118 టీఎంసీలకు సమానం.

పస్తులతో చస్తున్నా.. పట్టించుకోరా..!

వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

నరసరావుపేట: రెవెన్యూ వ్యవస్థలో కీలకంగా పనిచేస్తూ ప్రజలతో నిత్యం సంబంధాలు కలిగి ఉన్న గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్‌ఏ) సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. సంఘం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం కలెక్టరేట్ వద్ద సామూహిక రాయబారం, ధర్నా నిర్వహించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థలో సుదీర్ఘ కాలంగా 20వేల మంది గ్రామ రెవెన్యూ సహాయకులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని, వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక వేతనాలు పెరుగుతాయని, పదోన్నతులు అమలు చేస్తారని ఆశించి భంగపడ్డామన్నారు. వీఆర్‌ఏలకు నిబంధనలకు విరుద్ధంగా నైట్ వాచ్‌మెన్, అటెండర్ డ్యూటీలు వేస్తున్నారన్నారు. రీసర్వే పేరుతో ఇతర ప్రాంతాలకు వెళ్లి పనిచేయాల్సి వస్తుందని టీఏ, డీఏ అమలు చేయడం లేదన్నారు. అదనపు పని భారానికి ఆర్థిక సమస్యలు కూడా తోడుకావటంతో వీఆర్‌ఏల కుటుంబాలు పస్తులతో గడపాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ వీఆర్‌ఏలకు గత ఎనిమిదేళ్ల నుంచి వేతనాలు పెరగలేదన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బందగీ సాహెబ్ మాట్లాడుతూ వాచ్‌మెన్‌లు, అటెండర్లు ఎక్కడైతే అవసరమో అక్కడ సీనియారిటీ ఉన్న వీఆర్‌ఏలను శాశ్వత ప్రాతిపదికన నియమించాలన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఏఓ శివలీలకు వినతిపత్రం సమర్పించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనందరాజు, సత్తెనపల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, నరసరావుపేట డివిజన్ అధ్యక్షులు ఆనంద్ కుమార్, సిలార్ మసూద్, అధిక సంఖ్యలో గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

సేద్యం విభాగంలో హోరాహోరీ పోరు

బాపట్ల జిల్లా వేటపాలెంకు చెందిన ఎడ్లజతకు ప్రథమస్థానం



ఎడ్లబల ప్రదర్శనలో బండలాగుతున్న ఎడ్లజత

దాచేపల్లి: స్థానిక శ్రీ వీర్ల అంకమ్మతల్లి కొలుపుల తిరునాళ్ల సందర్భంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎడ్లబలప్రదర్శన పోటీలు బుధవారం హోరాహోరీగా జరిగాయి. సేద్యం విభాగంలో జరిగిన ఎడ్లబలప్రదర్శన పోటీలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకి చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లజత 5,122 అడుగుల దూరం బండలాగి విజేతగా నిలిచాయి. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడుకి చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్లజత 4,757 అడుగుల దూరం బండలాగి రెండవస్థానం, పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఉయ్యందంకి చెందిన సంపటం వీరబ్రహ్మం నాయుడు ఎడ్లజత 4,750 అడుగుల దూరంబండలాగి మూడవస్థానం, సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కోదాడకి చెందిన షేక్ హుస్సేన్, హుజూర్‌నగర్‌కి చెందిన జక్కుల సహస్ర యాదవ్ సంయుక్త ఎడ్లజత 4,644 అడుగుల దూరం బండలాగి నాల్గవస్థానం, కృష్ణ జిల్లా తోటవల్లూరు మండలం చినపులిపాకకి చెందిన ఆర్‌వీఎస్ బుల్స్, పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్తపాలెంకి చెందిన యామిని మోహన్‌శ్రీ సంయుక్త ఎడ్లజత 4,250 అడుగుల దూరంబండలాగి ఐదవస్థానం, ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం మర్రివేములకి చెందిన సిద్ధి మల్లేశ్వరి ఎడ్లజత 3,914 అడుగుల దూరంబండలాగి ఆరవస్థానంలో నిలిచాయి. విజేతలైన ఎడ్ల జతల రైతులకు నగదు, షీల్డ్స్‌ని దాతలు బహూకరించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా గూడా శ్రీనివాసరావు వ్యవహరించారు. కమిటీ సభ్యులు కొప్పుల గిరి, అనిసెట్టి శ్రీనివాసరావు, మునగా నిమ్మయ్య, కానుకొల్లు ప్రశాంత్ పోటీలను పర్యవేక్షించారు.

ఆర్టీసీ బస్సులో బంగారు ఆభరణాలు చోరీ

- 40 రోజుల క్రితం ఘటన
- శ్రీశైలంలో జీరో ఎఫ్ఐఆర్.. నరసరావుపేటకు కేసు బదిలీ

నరసరావుపేటటౌన్: ఆర్టీసీ బస్సులో బంగారు ఆభరణాలు చోరీకి గురైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సుమారు 40 రోజుల క్రితం విజయవాడ నుంచి శ్రీశైలం వెళ్తున్న బస్సులో ప్రయాణికుడి బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. శ్రీశైలం పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి సంఘటన జరిగిన ప్రాంతం నరసరావుపేట వన్‌టౌన్ పరిధి కిందకు రావటంతో కేసును బుధవారం ఇక్కడకు బదిలీ చేశారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల జిల్లా శ్రీశైలం ప్రాజెక్ట్ సున్నిపెంట గ్రామంలో విజయలక్ష్మి క్లినిక్ పేరిట బాడిస శ్రీనివాస్ వైద్యశాలను నిర్వహిస్తుంటారు. విజయవాడలో నిర్వహించనున్న శుభకార్యానికి శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి మార్చి 13వ తేదీ వెళ్లారు. అక్కడ నుంచి 18వ తేదీ స్వగ్రామానికి తిరుగు ప్రయాణం అయ్యేందుకు విజయవాడలో శ్రీశైలం వెళ్లే బస్సు నెం. ఏపీ 40జెడ్ 0106 ఎక్కారు. బంగారు ఆభరణాలు సుమారు 320 గ్రాముల కలిగి ఉన్న జ్యూయలరీ మొత్తాన్ని ఒక బ్యాగ్‌లో పెట్టుకుని, మరో బ్యాగ్‌లో దుస్తులు ఉంచి బస్సు క్యారియర్ మీద పెట్టారు. ఆదేరోజు నరసరావుపేట బస్టాండ్‌లో రాత్రి 8 గంటల సమయంలో అల్పాహారం కోసం బస్సును నిలిపారు. టిఫెన్ చేసివచ్చిన అనంతరం బస్సు బయలుదేరింది. మార్గ మధ్యంలో బ్యాగ్‌ను శ్రీనివాస్ అతని భార్య పరిశీలించగా అందులో ఉండాల్సిన బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఈ మేరకు శ్రీశైలం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అక్కడ జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సంఘటన జరిగిన ప్రాంతం నరసరావుపేట వన్‌టౌన్ పరిధిలోకి రావటంతో శ్రీశైలం నుంచి నరసరావుపేటకు కేసును ట్రాన్స్‌ఫర్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి.చరణ్ తెలిపారు.

సీహెచ్‌ఓలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నరసరావుపేట: జిల్లాలో ఆయుష్మాన్‌భవన్, రాష్ట్ర వైద్యఆరోగ కుటుంబ సంక్షేమ శాఖల కింద విలేజ్ క్లినిక్స్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా (సీహెచ్ఓ)పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని సీహెచ్‌ఓలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తమ డిమాండ్ల సాధనకోసం పట్టణంలోని స్టేషన్‌రోడ్డులో గల గాంధీ పార్కు ఎదుట ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీపీ) ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు ఎం.అనుపమ మాట్లాడుతూ తాము చేస్తున్న సమ్మె మూడోరోజుకు చేరిందన్నారు. తాము విధులకు గైర్హాజరు కావటంతో హెల్త్ సెంటర్లు మూతపడ్డాయన్నారు. ఉపాధ్యక్షుడు కె.వినోద్, జిల్లా కో-ఆర్డినేటర్ బి.సాగర్, ప్రధాన కార్యదర్శి రాము మాట్లాడుతూ జిల్లాలో తాము 361మంది పనిచేస్తున్నామన్నారు. తామందరమూ ఆరేళ్ల నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పని చేస్తున్నామని, నిబంధనల ప్రకారం తమను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సిఫార్సుకూడా చేసిందన్నారు. పెరుగుతున్న నిత్యావసరాలు ధరలను దృష్టిలో పెట్టుకొని తమతో పాటు పనిచేసే ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని కోరారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, ఈపీఎఫ్‌ఓ పునరుద్ధరించాలని, ఇతర డిమాండ్లు నెరవేర్చాలన్నారు. జాయింట్ సెక్రటరీ శివానాయక్, కె.శివ, కోటి, పెద్దసంఖ్యలో సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

వడదెబ్బతో వృద్ధురాలు మృతి

సత్తెనపల్లి: వడదెబ్బకు వృద్ధురాలు మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కంకణాలపల్లి గ్రామానికి చెందిన పచ్చా పార్వతమ్మ (75) గత రెండు రోజులుగా వీస్తున్న వడగాల్పులకు అనారోగ్యం పాలైంది. మంగళవారం మరింత నీరసించి, స్పృహ తప్పి పడిపోయింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన గుంటూరులోని ఒక ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎండలకు షుగర్ పెరిగి గ్యాస్ సమస్యతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి భర్త రఘునాథరావు, పెద్ద కుమారుడు శేషయ్య గతంలో మృతి చెందారు. మృతురాలికి చిన్న కుమారుడు శ్రీనివాసరావు, కుమార్తె శ్రీలక్ష్మి ఉన్నారు.

బైకుతో ఢీకొట్టి వృద్ధుడిపై దాడి

వట్టిచెరుకూరు: వృద్ధుడిని బైకుతో ఢీకొట్టి ఆపై దాడి చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడుకు చెందిన మురుకుట్ల సాంబశివరావు మంగళవారం సాయంత్రం తన నర్సరీ లోపల ఉన్నాడు. బయట ఓ దుకాణం వద్ద వాదులాట జరుగుతుండటంతో చూద్దామని వచ్చాడు. ఆ తర్వాత మోపెడ్‌పై నర్సరీ నుంచి ఇంటికి బయల్దేరాడు. అక్కడే ఉన్న గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సాంబశివరావును వెంబడించి వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టాడు. కింద పడిన అతడిపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో సాంబశివరావు తలకు, చేతులకు గాయాలయ్యాయి. స్థానికులు ప్రైవేటు ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి, అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. సాంబశివరావు భార్య రోశమ్మ ఫిర్యాదు మేరకు వట్టిచెరుకూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, దాడికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

యువకుడు ఆత్మహత్య

- స్నేహితుడి వద్ద రూ.3వేలు అప్పు
- తీర్చమని ఒత్తిడి చేయడంతో ఎలుకల పేస్ట్ తిన్న వైనం
- చికిత్స పొందుతూ మృతి



సలీం (ఫైల్)

అచ్చంపేట: అప్పు ఇచ్చిన వ్యక్తి తీర్చమని ఒత్తిడి చేయడంతో ఓ యువకుడు ఈనెల 21న ఎలుకల పేస్ట్ తిని ఆత్మహత్యాయత్నం చేశాడు. ప్రాణాపాయంలో ఉన్న అతడిని గుంటూరు జీజీహెచ్‌కి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు, సేకరించిన సమాచారం ప్రకారం.. అచ్చంపేట మండలం, చింతపల్లి గ్రామానికి చెందిన షేక్ సలీం(19) అచ్చంపేటలో మోటార్ మెకానిక్‌గా పనిచేస్తు ఉంటాడు. తన స్వగ్రామమైన చింతపల్లిలో స్నేహితుని వద్ద రూ.3వేలు అప్పు తీసుకున్నాడు. తీసుకున్న అప్పు తీర్చమని స్నేహితుడు తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతో ఇరువురి మధ్య తీవ్ర ఘర్షణ చేటుచేసుకుంది. సలీం చేతిలోఉన్న సెల్‌ఫోన్‌ని స్నేహితుడి లాక్కొని, అప్పు విషయం ఇంట్లో చెబుతానిని బెదిరించడం వంటి కారణాలవల్ల గత్యంతరం లేని పరిస్థితులలో ఎలుకలమందు (పేస్ట్) తిన్నాడు. అప్పటివరకు తమ అబ్బాయి అప్పుచేశాడని గాని, వీరిద్దరి మధ్య ఘర్షణ జరిగిందన్న విషయం తల్లిదండ్రులకు తెలియదు. ఎలుకలమందు తిన్న విషయాన్ని గమనించిన తల్లిదండ్రులు, గ్రామస్తులు వెంటనే గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ సుమారు వారం రోజులపాటు మృత్యువుతో పోరాడి బుధవారం మృతి చెందాడు. మృతుడు సలీంకు చదువు అబ్బకపోవడంతో తల్లిదండ్రులు అచ్చంపేటలో మోటారు మెకానిక్ షెడ్ పెట్టించారు. తల్లిదండ్రులకు ఇద్దరు సంతానం. ఒకరు ఆడపిల్ల కాగా మరొకరు సలీం. ఎదిగొచ్చిన ఒక్కగానొక్క కొడుకు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు.

అప్పులవల్లే మృతి చెందినట్లు వాంగ్మూలం

చింతపల్లికి చెందిన షేక్ సలీం అనే యువకుడు ఈనెల 21వ తేదీన ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వైద్యశాలలో సలీం నుంచి వాంగ్మూలం తీసుకున్నాం. అతను బెట్టింగ్‌ల వల్ల డబ్బు పోగొట్టుకున్నానని చెప్పలేదు. చేసిన అప్పు తిరిగి ఇవ్వకపోవడం, వాళ్ల నుంచి వచ్చిన ఒత్తిడి తట్టుకోలేకనే ఆత్మహత్యాయత్నం చేసుకున్నానని చెప్పాడు. ఇదే విషయంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాం.

– శ్రీనివాసరావు, అచ్చంపేట సీఐ

టెన్త్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు వివరాలు

నరసరావుపేట: జిల్లాలో పదోతరగతి రెగ్యులర్ అడ్వాన్సుడు సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 19వ తేదీ నుంచి 28వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్షల ఫీజుల వివరాలు ఈ విధంగా ఉంటాయన్నారు. మూడు సబ్జెక్టులకు రూ.110, అంతకు మించితే రూ.125 ఏప్రిల్ 30వ తేదీలోగా చెల్లించాలన్నారు. మే ఒకటవ తేదీ నుంచి పరీక్ష జరిగే ముందు రోజువరకు రోజుకు రూ.50 అదనంగా ఆలస్య రుసుంను సంబంధిత పాఠశాల హెచ్‌ఎంలకు చెల్లించాలన్నారు. రీకౌంటింగ్ కోసం ప్రతి సబ్జెక్టుకు రూ.500, రీ వెరిఫికేషన్ కోసం ప్రతి సబ్జెక్టుకు రూ.1000 ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు ఈనెల ఒకటవ తేదీ రాత్రి 11గంటల్లోగా చెల్లించి, దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- 14 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ: బైక్‌లు చోరీ చేస్తున్న అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను బుధవారం నల్లగొండ జిల్లా వాడపల్లి పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి 14 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఏపీలోని పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం కావూరు గ్రామానికి చెందిన నలమాల ఎర్రబ్బాయి అలియాస్ లూథర్, అదే గ్రామానికి చెందిన గంజి అంకమరావు, పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం జానపహాడ్ గ్రామానికి చెందిన మట్టిపల్లి శ్రీకాంత్ ముఠాగా ఏర్పడ్డారు. బైక్‌లు చోరీ చేసి వాటిని విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారు. నలమాద ఎర్రబాబు తెలంగాణలోని నల్లగొండ, దామరచర్ల, నార్కట్‌పల్లి, ఇబ్రహీంపట్నంతో పాటు ఏపీలోని మార్టూరు, పొన్నూరులో ప్రభుత్వ కార్యాలయాలు, హోటళ్లు, వైన్స్‌లు, రాత్రివేళ ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన బైక్‌లను చోరీ చేసి, వాటిని గంజి అంకమరావు, మట్టిపల్లి శ్రీకాంత్‌తో కలిసి తక్కువ ధరకు విక్రయించేవాడు. బుధవారం ఉదయం వాడపల్లి ఎస్ఐ సిబ్బందితో కలిసి రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎర్రబ్బాయి, అంకమరావు చోరీ చేసిన బైక్‌లను అమ్మడానికి దామరచర్ల నుంచి గుంటూరు వైపు వెళుతున్నారు. అనుమానం వచ్చి ఎస్ఐ వారిని పట్టుకుని విచారించగా నిజం ఒప్పుకున్నారు. వారిచ్చిన సమాచారం మేరకు మట్టిపల్లి శ్రీకాంత్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఆరు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లు, ఏడు పల్సర్ బైక్‌లు, ఒక షైన్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.26.50 లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. ముగ్గురు నిందితులపై వాడపల్లి పోలీస్ స్టేషన్‌లో– 3, నల్లగొండ వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీస్ స్టేషనల్లో ఒక్కోటి చొప్పున, నార్కట్‌పల్లి పీఎస్‌లో– 2, ఇబ్రహీంపట్నం పీఎస్‌లో– 1, ఏపీలోని మార్టూర్ పీఎస్‌లో– 2, పొన్నూరు పీఎస్‌లో –1, రాజమండ్రిలో– 1 కేసు నమోదైనట్లు ఎస్పీ పేర్కొన్నారు. మొత్తం 22 బైక్‌లు దొంగిలించినట్లుగా నిందితులు అంగీకరించారని, మిగతా వాహనాలను కూడా స్వాధీనం చేసుకుంటామని ఆయన తెలిపారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు పర్యవేక్షణలో ఈ కేసును ఛేదించిన రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, సీసీఎస్ సీఐ డానియేల్, వాడపల్లి ఎస్ఐ ఎ. శ్రీకాంత్ రెడ్డి, పోలీస్ సిబ్బంది సతీష్, భాస్కర్, వెంకటేశ్వర్లు, రషీద్, సీసీఎస్ సిబ్బంది విష్ణువర్ధనగిరి, రాంప్రసాద్, పుష్పగిరి, శ్రీనివాస్‌రెడ్డిని ఎస్పీ అభినందించారు.

విద్యారంగంలో అసంబద్ధ విధానాలపై ఆందోళన

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బసవ లింగారావు



మాట్లాడుతున్న బసవ లింగారావు

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యారంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న అసంబద్ధ విధానాలకు నిరసనగా ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ నుంచి ఆందోళన, పోరాటాలు చేపడుతున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. బసవలింగారావు, మొహమ్మద్ ఖాలీద్ పేర్కొన్నారు. కన్నావారితోటలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. 117 జీవోను రద్దు చేసి, పాఠశాల విద్యను ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలుగా పూర్వస్థితికి మార్చుతామని చెప్పిన ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో 3,4,5 తరగతులు కొనసాగించడమే కాకుండా కొన్నిచోట్ల ఒకటి నుంచి టెన్త్ వరకు తరగతులు నిర్వహిస్తామని చెప్పడం ఉపాధ్యాయ, విద్యార్థిలోకాన్ని మోసం చేయడమేనని విమర్శించారు. తొమ్మిది రకాల పాఠశాలల వ్యవస్థను తీసుకురావడం ద్వారా విద్యారంగాన్ని విధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రాథమిక పాఠశాలల్లో మాతృభాషా మాధ్యమాన్ని ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల సూచనలు పరిగణనలోకి తీసుకోకుండా విద్యాశాఖ ఏకపక్ష నిర్ణయాలకు ఈనెల 5న తేదీ పాత తాలుకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, మే 9న జిల్లా కేంద్రంలో ధర్నా, మే14 న విజయవాడలో రాష్ట్రస్థాయిలో ధర్నా నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. మొత్తం 12 డిమాండ్స్ పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పి.లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి ఎస్.ఎస్.ఎన్. మూర్తి, జి.దాస్, జిల్లా కౌన్సిలర్లు పి.శివరామకృష్ణ, చక్కా వెంకటేశ్వర్లు, గురుమూర్తి, జహంగీర్, షూకూర్, మాలకొండయ్య పాల్గొన్నారు.